సూర్య
సోమవారం 20 - 04 -2026

# మహిళా బిల్లుపై విపక్షాల ద్వంద్వ నీతి..

## కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు మహిళలే బుద్ధి చెప్తారు



**వేములవాడ టౌన్ ఏప్రిల్ 19 సూర్య న్యూస్ :–** మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తున్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలు 33 శాతం రిజర్వేషన్ల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తుంటే, పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టిన తరుణంలో విపక్షాలు వ్యవహరించిన తీరు అత్యంత శోచనీయమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి మహిళా సాధికారతపై అస్సలు చిత్తశుద్ధి లేదని, ఆ పార్టీ కేవలం ఇందిరా గాంధీ, సోనియా, ప్రియాంక గాంధీలకే అవకాశాలు రావాలని కోరుకుంటోందని విమర్శించారు. సామాన్య మహిళలు అసెంబ్లీకి, పార్లమెంటుకు వెళ్లడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని ఆరోపించారు. అటు సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, ఇటు కాంగ్రెస్ ప్రతినిధి ఆది శ్రీనివాస్ ఇద్దరూ తమ స్వార్థ రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. పార్లమెంటులో ఒక్క ఎంపీ సభ్యుడు కూడా లేని బీఆర్ఎస్ పార్టీ, బిల్లును వ్యతిరేకించే వారితో చేతులు కలపడం సిగ్గుచేటన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ మహిళా బిల్లును ఖచ్చితంగా అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు రానున్న రోజుల్లో మహిళలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షురాలు బరకం లక్ష్మీ నవీన్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండ వర్షిని నరేష్, మెరుగు మంజుల శ్రీనివాస్, ఉరవకొండ లక్ష్మీ రాజు, వేమనపల్లి శోభ, గుర్రం మన సూర్య తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై ఉక్కుపాదం వేయాలి.

## అక్షయ తృతీయ సందర్భంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు.




**డోర్నకల్ ఏప్రిల్ 19 సూర్య న్యూస్:–** బాల్య వివాహాలను సమాజం పూర్తిగా అరికట్టాలని, అలాంటి వివాహాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని షేర్ స్వచ్ఛంద సంస్థజస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్స్ జే ఆర్ సి ప్రతినిధులు హెచ్చరించారు. అక్షయ తృతీయ సందర్భంగా ఆదివారం మహబూబాబాద్ జిల్లా అనంతారం దేవాలయాలు, మసీదు, చర్చిల వద్ద బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ రమేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల భవిష్యత్తును నాశనం చేస్తాయని, వాటిని ఎవ్వరూ ప్రోత్సహించరాదని అన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100కు సమాచారం అందించాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమన్న, ఉమామహేశ్వరి, హిమబిందు, అంగన్వాడీ టీచర్లు, వార్డ్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లిలో ఘనంగా బగారా బువ్వ – కోడి కూర హోటల్ ఆరంభం

## ప్రముఖుల సమక్షంలో ప్రారంభమైన కొత్త ఫుడ్ సెంటర్

## రుచికరమైన వంటకాలతో ప్రజలను ఆకట్టుకోవాలని సూచనలు



శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బీడీఎల్ క్రాస్ రోడ్డులో ఆదివారం బగారా బువ్వ – కోడి కూర హోటల్‌ను ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు భీమ్ భరత్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్‌పల్లి పట్టణం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. హోటల్‌కు వచ్చే వినియోగదారులకు నాణ్యమైన, శుభ్రతతో కూడిన రుచికరమైన ఆహారం అందించాలని యాజమాన్యానికి సూచించారు. హోటల్ యజమానులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

## మణుగూరు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు గురు స్వామి పిలుపు

## హెల్మెట్ పంపిణీ చేస్తున్న బార్ కౌన్సిల్ అధ్యక్షుడు



**అశ్వాపురం, ఏప్రిల్ 19 సూర్య న్యూస్:–** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని మణుగూరు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు గురు స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆయన వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురు స్వామి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం వల్లనే జరుగుతున్నాయని, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి, ఎస్‌కేటి గ్రూప్స్ అధినేత పిచ్చేశ్వర రావు పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో నేడు ప్రజావాణి రద్దు.

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రకటన.



**డోర్నకల్ ఏప్రిల్ 19 సూర్య న్యూస్:–** జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న సంక్షేమ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాల నేపథ్యంలో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుంచి వారం రోజుల పాటు సంక్షేమ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులంతా క్షేత్రస్థాయిలో కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండటంతో ప్రజావాణి నిర్వహించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. అందువల్ల ప్రజలు తమ దరఖాస్తులతో సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం వాయిదా

**రామగిరి ఏప్రిల్ 19 సూర్య న్యూస్:–** రామగిరి మండలం 7 గ్రామపంచాయతీల పరిధిలో ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు పెద్దనాన్న అకాల మరణం కారణంగా వాయిదా పడినట్లు ఐకెపి ఎపిఎం దొమ్మటి పద్మ తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంకు సంబంధించిన సమాచారాన్ని త్వరలోనే ప్రకటిస్తామని ఆమె తెలిపారు.

# గురుద్వారా బయట కాల్పులు.. ఇటలీలో ఇద్దరు భారతీయుల మృతి

ఇటలీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. వైశాఖి పండుగ వేడుకల సందర్భంగా ప్రార్థనల కోసం గురుద్వారాకు వచ్చిన ఇద్దరు భారతీయులను దుండగుడు కాల్చి చంపాడు. బెర్గామో ప్రావిన్స్‌లోని కోవో పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ విషాదం జరిగింది. ప్రార్థనలు ముగించుకుని గురుద్వారా నుంచి బయటకు వస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది.

# శంకర్ పల్లిలో లక్ష్మీకాంత్ రెడ్డి స్మారక బ్యాడ్మింటన్ పోటీలు

## అరుణోదయ యూత్ క్లబ్ నిర్వహణ విజేతలకు బహుమతుల ప్రదానం



**శంకర్ పల్లి, ఏప్రిల్ 19 సూర్య న్యూస్ :–** శంకర్ పల్లిలో అరుణోదయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో స్వర్గీయ బి. లక్ష్మీకాంత్ రెడ్డి జ్ఞాపకార్థం బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. కాశెట్టి చంద్రమోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ సాత ప్రవీణ్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రకాష్ గుప్తా, మాజీ అరుణోదయ యూత్ క్లబ్ అధ్యక్షులు, బి ప్రణీత్( చిన్న), సటగళ్ల శ్రీధర్ గౌడ్ మోహన్ రెడ్డి, జూలకంటి పాండురంగారెడ్డి, నాయకులు చేకూర్త గోపాల్ రెడ్డి, పార్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్‌లో ఆశా కార్యకర్తల నూతన కమిటీ ఎన్నిక.

## డిమాండ్ల సాధనకు పోరాటం కొనసాగిస్తామని నాయకుల స్పష్టం.



**డోర్నకల్, ఏప్రిల్ 19 సూర్య న్యూస్ :–** డోర్నకల్ మండలంలో ఆశా కార్యకర్తల యూనియన్ నూతన కమిటీని ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ యూనియన్ అనుబంధ సంస్థ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు కూర వెంకన్న ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా ఐఎన్‌టీయూసీ అధ్యక్షురాలు మోమీద ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షురాలిగా అనిత, ప్రధాన కార్యదర్శిగా స్రవంతి, కార్యదర్శిగా నిర్మల, కోశాధికారిగా నాగరాణిని ఎన్నుకోగా, గౌరవ అధ్యక్షురాలిగా యల్లావుల సువర్ణను ఎంపిక చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు రూ.18 వేల జీతం ఇవ్వాలని, ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన ఆశా కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. 13వ వార్డు కౌన్సిలర్ యల్లావుల సువర్ణ హరికృష్ణ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి తెలియజేస్తామని, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా 20 సంవత్సరాల పాటు ఆశా కార్యకర్తగా సేవలందించి, అనంతరం మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన యల్లావుల సువర్ణ హరికృష్ణను రాష్ట్ర నాయకులు, మండల ఆశా కార్యకర్తల యూనియన్ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. సమావేశానికి మండలంలోని ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# చలో ఫతేపూర్‌కు సిద్ధం గోడపత్రిక ఆవిష్కరణ

## ఏప్రిల్ 24న మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు ఏర్పాట్లు వేగవంతం

**శంకర్ పల్లి ఏప్రిల్ 19 సూర్య న్యూస్ :–** ఫతేపూర్ వార్డులో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన "చలో ఫతేపూర్" గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 24న సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొననున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి.



# పాఠశాలకు ఆటో కొనుగోలుకు దాతల విరాళాలు

## అనిత దుర్గారావు దంపతులు చావా రామకృష్ణ పుట్ట అనిల్ కుమార్

**అశ్వాపురం ఏప్రిల్ 19 సూర్య న్యూస్:–** మండల పరిధిలోని నెల్లిపాక బంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు ఇరవెండి, రామచంద్రాపురం సత్యనారాయణపురం గ్రామాల నుండి విద్యార్థులను తరలించేందుకు, ఆటో కొనుగోలుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు.



స్పందిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు తమ శక్తి వంచన లేకుండా విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం పాఠశాల పూర్వ విద్యార్థిని భద్రాచలం కు చెందిన నిడదవోలు అనిత – దుర్గారావు దంపతులు 25 వేల రూపాయలు, టేకులగుట్టకు చెందిన చావా రామకృష్ణ 50 వేల





రూపాయలు, నెల్లిపాక బంజరకు చెందిన పుట్ట అనిల్ కుమార్ 10 వేల రూపాయలు సర్పంచ్ మంద్రు రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# వాణిజ్య భవనంలో ఆసుపత్రి..

# ప్రజల ప్రాణాలతో ఆట?



**అగ్ని ప్రమాదాల మోగం**

**ఇది కేవలం ఒక ఆసుపత్రి విషయం కాదు**

**ఫైర్ ఎన్ ఓ సి ప్రాసెస్‌లో ఉంటే ఆసుపత్రి ఎలా నడుస్తుంది**

**ప్రమాదం జరిగాక స్పందించడం కంటే, ముందే నివారించడం ప్రభుత్వ బాధ్యత కాదా?**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 19 సూర్య న్యూస్ :-** నగరంలో వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాలు ప్రజల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కానీ ఈ నేపథ్యంలో బయటపడుతున్న అసలు విషయం మరింత షాకింగ్. వాణిజ్య భవనంలో నడుస్తున్న ఒక ప్రైవేట్ ఆసుపత్రి, ఇప్పటికీ సరైన "ఫైర్ ఎన్ ఓ సి" లేకుండానే కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఆర్.టి.ఐ ద్వారా లభించిన అధికారిక సమాధానం ప్రకారం, సంబంధిత ఆసుపత్రి ఫైర్ ఎన్ ఓ సి ఇంకా ప్రాసెస్‌లో ఉంది అని స్పష్టంగా పేర్కొన్నారు. అంటే ఫైర్ ఎన్ ఓ సి ఇంకా ప్రాసెస్‌లో ఉంది, కానీ ఆసుపత్రి ఎలా నడిపిస్తారు. ప్రజల ప్రాణాలు రిస్క్‌లో ఉన్నా, అధికారులు మౌనం పాటిస్తున్నారు.

**నిన్నటి బస్సులో అగ్ని ప్రమాదం తృటిలో తప్పిన ప్రాణ నష్టం..** ఈ నిర్లక్ష్యానికి ఉదాహరణగా ఏప్రిల్ 17 రాత్రి జరిగిన ఘటనను చూడొచ్చు. కెపిహెచ్బి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి లోని పిలర్ నం. ఏ-834 సమీపంలో ఒక ప్రైవేట్ బస్సులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు: చీూ 02 దీ 9955 (శ్రీ దుర్గా మల్లేశ్వరి ట్రావెల్స్), మార్గం గచ్చిబౌలి నుండి పాలకొల్లు వెళ్తుంది. ఈ బస్సులో 18 మంది ప్రయాణికులు ఉన్నారు. అదృష్టవశాత్తు అందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. కానీ ఒక్క నిమిషం ఆలస్యమైతే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవచ్చు.

**అసలు ప్రశ్నలు సమాధానం ఎవరు చెప్తారు?**

ఫైర్ ఎన్ ఓ సి లేకుండా ఒక వాణిజ్య భవనంలో ఆసుపత్రి ఎలా నడుస్తోంది? 2025 నిబంధనల ప్రకారం తప్పనిసరి అయినప్పటికీ, ఎందుకు అమలు చేయడం లేదు?ఫైర్ ఎన్ ఓ సి"ప్రాసెస్‌లో ఉంది" అనేది ప్రాణాలకు గ్యారంటీనా?

**లేక బాధ్యత తప్పించుకునే మాటేనా?**

ఇది కేవలం ఒక ఆసుపత్రి విషయం కాదు..

ఇది సిస్టమ్ ఫెయిల్యూర్?

ఇది అధికారుల నిర్లక్ష్యం?


ఇది ప్రజల ప్రాణాలతో ఆట?

**నిబంధనలు ఎక్కడ? అమలు ఎక్కడ?**

2025 మేలో వచ్చిన కొత్త మార్గదర్శకాల ప్రకారం, 15 మీటర్ల లోపు ఉన్న భవనాలకు కూడా ఫైర్ ఎన్ ఓ సి తప్పనిసరి. అయితే అదే నిబంధనను అమలు చేయాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



హైడ్రా అధికారుల మౌనం.. చర్యలపై అనుమానాలు?



**ప్రజల డిమాండ్ ఇప్పుడే చర్యలు కావాలి..**

ఫైర్ ఎన్ ఓ సి లేని ఆసుపత్రులపై తక్షణం సీలింగ్/క్లోజర్ చర్యలు. అన్ని వాణిజ్య భవనాలపై సర్ప్రైజ్ ఫైర్ ఇన్‌స్పెక్షన్స్, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై విచారణ, చర్యలు తీసుకోవాలి.

**ప్రమాదం తర్వాత కాదు, ముందే చర్యలు తీసుకోండి..**

ఒక పెద్ద ప్రమాదం జరిగాక స్పందించడం కంటే, ముందే నివారించడం ప్రభుత్వ బాధ్యత కాదా? ప్రాణాలు పోయాక విచారణలు చేస్తే ప్రయోజనం ఏమిటి ఇప్పుడు తీసుకునే నిర్ణయాలే రేపటి ప్రాణాలను కాపాడగలవు.

# మనుషులను ఓడించిన చైనా రోబోలు..

# హాఫ్ మారథాన్‌లో సంచలనం...

**బీజింగ్‌లో జరిగిన హాఫ్ మారథాన్‌లో హ్యూమనాయిడ్ రోబోల అద్భుత ప్రదర్శన**

**మానవ రన్నర్లను మించిన వేగంతో పరుగెత్తిన రోబోలు**

**50 నిమిషాల్లోనే రేసు పూర్తి చేసి ప్రపంచ రికార్డు సృష్టించిన 'లైట్నింగ్' రోబో**

**గతేడాదితో పోలిస్తే ఈసారి రోబోల సామర్థ్యంలో భారీ పురోగతి**

**రోబోటిక్స్ రంగంలో చైనా ఆధిపత్యానికి ఈ రేసు నిదర్శనం**

రోబోటిక్స్ టెక్నాలజీలో చైనా సరికొత్త సంచలనం సృష్టించింది. బీజింగ్‌లో జరిగిన ఓ హాఫ్ మారథాన్‌లో హ్యూమనాయిడ్ రోబోలు మానవ అథ్లెట్లను మించిన వేగంతో పరుగెత్తి, ఏకంగా ప్రపంచ రికార్డును సైతం బద్దలు కొట్టాయి. ఈ అద్భుత ప్రదర్శన, రోబో సాంకేతికతలో జరుగుతున్న వేగవంతమైన పురోగతికి నిదర్శనంగా నిలిచింది.





బీజింగ్ ఈ-టౌన్ వేదికగా జరిగిన ఈ హాఫ్ మారథాన్ రెండో ఎడిషన్‌లో 12,000 మంది మానవ రన్నర్లతో పాటు చైనాలో తయారైన వందలాది హ్యూమనాయిడ్ రోబోలు పోటీపడ్డాయి. భద్రతా కారణాల రీత్యా మనుషులు, రోబోలకు వేర్వేరు ట్రాక్‌లపై ఈ 21 కిలోమీటర్ల రేసును నిర్వహించారు. గతేడాది జరిగిన మొదటి ఈవెంట్‌లో చాలా రోబోలు కనీసం రేసును పూర్తి చేయలేకపోయాయి. కానీ ఈసారి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 100కి పైగా రోబో బృందాలు పాల్గొనగా, వాటిలో సగానికి పైగా ఎలాంటి రిమోట్ కంట్రోల్ సాయం లేకుండానే స్వయంప్రతిపత్తంగా (ఖ్‌శీఅశీఎశీబంశ్రీఎ) గమ్యాన్ని చేరుకుని అందరినీ ఆశ్చర్యపరిచాయి.

ఈ ఏడాది విజేతగా నిలిచిన హానర్ కంపెనీకి చెందిన 'లైట్నింగ్' అనే రోబో కేవలం 50 నిమిషాల 26 సెకన్లలోనే రేసును పూర్తి చేసింది. ఇది ఇటీవలి మానవ హాఫ్ మారథాన్ వరల్డ్ రికార్డు కంటే చాలా తక్కువ సమయం కావడం విశేషం. అంతేకాకుండా, తొలి మూడు స్థానాలను కూడా హానర్ కంపెనీకి చెందిన రోబోలే కైవసం చేసుకుని తమ ఆధిపత్యాన్ని చాటాయి. వేగంగా పరుగెత్తించడం ద్వారా రోబోల సామర్థ్యాన్ని, వాటిలోని కూలింగ్ సిస్టమ్స్‌ను పరీక్షించవచ్చని, ఈ సాంకేతికత భవిష్యత్తులో ఇతర పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడుతుందని హానర్ కంపెనీ ఇంజనీర్ దు షియావోడి తెలిపారు.

చైనా ప్రభుత్వం రోబోటిక్స్ రంగానికి సబ్సిడీలు, మౌలిక సదుపాయాలతో భారీ ప్రోత్సాహం అందిస్తోంది. తయారీ, ప్రమాదకరమైన పనులు, రక్షణ రంగాల్లో రోబోలు విప్లవాత్మక మార్పులు తీసుకురాగలవని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి హ్యూమనాయిడ్ రోబోలు ఇంకా వాణిజ్యపరంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానప్పటికీ, ఈ రేసులో కనబరిచిన పురోగతి భవిష్యత్తులో రోబోలు మన జీవితాల్లో ఎంతటి కీలక పాత్ర పోషించబోతున్నాయో స్పష్టంగా సూచిస్తోంది.

# చిన్న పండే కదా అని తీసేయకండి... తింటే ఎన్నో లాభాలు!

**గుండె ఆరోగ్యానికి, రక్త ప్రసరణకు మేలు చేసే అల్బకరా**

**మలబద్ధకం సమస్యకు సహజమైన పరిష్కారం**

**యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం, రోగనిరోధక శక్తికి భరోసా**

**ఎముకల పటుత్వానికి అవసరమైన విటమిన్ కె ఇందులో అధికం**

**తక్కువ కేలరీలు, రక్తంలో చక్కెర స్థాయిలను పెంచదు**

చూడటానికి చిన్నగా, ఎరుపు రంగులో ఆకర్షణీయంగా కనిపించే అల్బకరా పండు (ప్లం) ఆరోగ్య ప్రయోజనాల గని అని నిపుణులు చెబుతున్నారు. రుచికి తియ్యగా, పుల్లగా ఉండే ఈ పండును మన ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా అనేక రకాల అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని సూచిస్తున్నారు.అల్బకరా పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, హానికరమైన ఫ్రీ రాడికల్స్ నుంచి కణాలను కాపాడతాయి. ముఖ్యంగా, ఇవి రక్త ప్రసరణను మెరుగుపరచడంలో మరియు గుండె సంబంధిత వ్యాధుల ముప్పును తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కార్డియో వాస్కులర్ వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది.అనేకమంది ఎదుర్కొనే సాధారణ సమస్య మలబద్ధకం. అల్బకరా పండులో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి, మలబద్ధకం నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తుంది. అలాగే, ఈ పండ్లలో విటమిన్ కె అధిక మోతాదులో లభిస్తుంది. ఇది ఎముకలను బలంగా, ఆరోగ్యంగా ఉంచడానికి ఎంతగానో దోహదపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి, మధుమేహంతో బాధపడేవారికి కూడా అల్బకరా ఒక మంచి ఎంపిక. ఎందుకంటే వీటిలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అదే సమయంలో, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను అకస్మాత్తుగా పెంచవు. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలోనూ ఈ పండు సహాయపడుతుంది. ఇన్ని ప్రయోజనాలున్న అల్బకరాను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు.



## డి.వి.జి ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు ఆర్థికసాయం



**శేరిలింగంపల్లి ఏప్రిల్ 19 సూర్య న్యూస్ :-** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్ కాలనీ కి చెందిన కొమ్ము దయానంద్(65) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, డివిజి ట్రస్ట్ ద్వారా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, నరసింహ, ముత్యాలు, రోహన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంత ఎదిగినా మన సంస్కృతి, సంప్రదాయాలను మరవొద్దు : ఎమ్మెల్యే కే.పీ వివేకానంద్ గౌడ్



**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 19 సూర్య న్యూస్ :-** గాజుల రామారం డివిజన్ పరిధిలోని దేవేందర్ నగర్ పద్మావతి కన్వెన్షన్ సెంటర్ నందు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) 100 ఏళ్లను పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన "హిందూ సమ్మేళనం" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కే.పీ వివేకానంద్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంత ఎదిగినా మన సంస్కృతి, సంప్రదాయాలను మనం మరిచిపోవద్దని, నేటి యువత ఆధునికతను అందిపుచ్చుకుంటూ మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, యోగాధారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హిందూ ధర్మ ప్రచారకులు బోధన్ శ్రీ ఉదయ్ మహారాజ్ స్వామీజీ, తత్వ స్కూల్ ఉపాధ్యాయురాలు హిమబిందు, జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మావుదూరి సూర్యనారాయణమూర్తి, అధ్యక్షులు మినుముల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి చింత శివరాజ్, కోశాధికారి దొమ్మాట ప్రభాకర్ గౌడ్, సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.



## కుటుంబసభ్యులతో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**హైదరాబాద్ ఏప్రిల్ 19 సూర్య న్యూస్ :-** కలియుగ ప్రత్యక్ష దైవం దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఆదివారం ఉదయం వేకువ జామున కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవడం నాకు ఎంతో ఆనందం, అదృష్టంగా భావిస్తున్నానని, స్వామివారి ఆశీస్సులతో మా నియోజకవర్గ ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను, ప్రతి ఇంట్లో సుఖశాంతులు నెలకొనాలి, యువతకు మంచి భవిష్యత్తు కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తమన్నా

ప్రముఖ నటి తమన్నా ఆదివారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. కలియుగ దైవం శ్రీవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. తన తిరుమల పర్యటనకు సంబంధించిన ఫొటోను తమన్నా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్నారు. ఈ ఫొటోలో ఆమె గులాబీ రంగు సంప్రదాయ దుస్తులు, ఎరుపు రంగు దుపట్టాతో ఆలయం వెలుపల తోటి భక్తులతో కలిసి కనిపించారు. అంతకుముందు, తిరుమలకు కారులో ప్రయాణిస్తున్న వీడియోను కూడా ఆమె షేర్ చేశారు. తమన్నాను చూసిన పలువురు అభిమానులు ఆమెతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపించారు. ఇక సినిమాల విషయానికొస్తే, తమన్నా ప్రస్తుతం పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి ఆమె తొలిసారి నటిస్తున్న 'వివన్ - ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' చిత్రం మే 15న థియేటర్లలో విడుదల కానుంది. దీనితో పాటు, శశాంక ఘోష్ దర్శకత్వంలో వస్తున్న 'రాగిణి 3' చిత్రంలో కూడా ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు.

